క్లుప్తంగా

వ్యవసాయ శాఖాధికారిగా షణ్ముగం



బుచ్చినాయుడుకండ్రిగ: మండల వ్యవసాయ శాఖాధికారిగా షణ్ముగం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏర్పేడు మండల వ్యవసాయ శాఖాధికారిగా పనిచేస్తున్న షణ్ముగం మండల ఏఓగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న వ్యవసాయశాఖ అధికారి భారతి నాగలాపురం ఏఓగా బదిలీపై వెళ్లారు. మండలంలోని రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏఓ షణ్ముగం తెలిపారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గురుదక్షిణామూర్తికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేషాలంకరణ చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న టీచర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులందరికీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రలో భాగంగా నూతన విద్యా సంవత్సరం కొత్త పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, డిక్షనరీ, యూనిఫామ్ తదితర విద్యాసామగ్రిని బుధవారం ప్రధానోపాధ్యాయిని వాణి పంపిణీ చేశారు. పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేయాలనే ఉద్దేశంతో అందరికీ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్ బాబు, నాదెండ్ల మురళి, లక్ష్మయ్య, జగన్నాథం, దాసు, మాధవీలత, సుజన పాల్గొన్నారు.

ఓపెన్ టెన్నిస్‌లో శ్రీకాళహస్తి విద్యార్థి ప్రతిభ

శ్రీకాళహస్తి: ఓపెన్ టెన్నిస్ అండర్–14 విభాగంలో శ్రీకాళహస్తికి చెందిన పదో తరగతి విద్యార్థి టి.గురురోహిత్ ప్రతిభ చాటాడు. చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి పట్టణాలకు సంబంధించి జరిగిన ఓపెన్ టెన్నిస్ క్రీడాపోటీలు సింగిల్స్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. అలాగే డబుల్స్‌లో రన్నర్‌గా నిలిచాడు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

సత్యవేడు: సత్యవేడు గ్రామ దేవత సదవాలమ్మ ఆలయ నిర్మాణానికి స్మైల్ ఈకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత మల్లి నాయుడు రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం స్థానిక నడివీధి గంగమ్మను దర్శించుకున్న ఆయన ఆలయ నిర్వాహకులకు విరాళం మొత్తాన్ని అందజేశారు.

గంగమ్మకు సారె సమర్పణ

తిరుపతి మంగళం: తిరుపతి నగర పరిధిలోని తిమ్మినాయుడుపాళెం గ్రామంలో గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. గురువారం చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి జాతరలో పాల్గొని గంగమ్మకు సారె సమర్పించారు. తిరుపతి ప్రజలను చల్లగా చూడాలని అమ్మవారిని మొక్కుకున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు సుశీలయాదవ్, ప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

పాపాలకు వసంతం



రాజీవ్‌నగర్‌లో ఇళ్లు కూలదోస్తున్న జేసీబీ

రెడ్ బుక్ రాజ్యాంగానికి వసంతం నిండింది. అన్ని వర్గాల ప్రజలను కూటమి నేతలు నరక యాతన పెడుతున్నారు. బూటకపు మాటలతో గద్దెనెక్కిన కూటమి నేతలు, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు, ప్రజలపై దాడులు.. అక్రమ అరెస్టులు, ఆస్తుల ధ్వంసం చేయడం మినహా చేసేదేమీ లేదు. సూపర్ సిక్స్ పథకాల ఊసు లేదని, ఈ మోసాల పాపపు పాలనపై ప్రజలు మండిపడుతున్నారు.

- ఆక్రమణల పేరుతో సుమారు 400 ఇళ్లు కూల్చివేత
- దాడులు, అరాచకాలు

శ్రీకాళహస్తి: రెడ్‌బుక్ పాలనకు ఒక సంవత్సరం పూర్తి అయ్యింది. 12 నెలలు అక్రమాలు, ఆక్రమణలు, ఇసుక మాఫియా, ఉద్యోగుల తొలగింపు, గ్రామ బహిష్కరణలు, దాడులతో ఏడాది పాలన శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పూర్తయింది.

400 ఇళ్లు, పునాదులు కూల్చివేత

ఆక్రమణల పేరుతో సుమారు 400 ఇళ్లు, పునాదులు కూల్చివేశారు. రాజీవ్‌నగర్, ఏర్పేడు మండలంలోని వికృతమాల, రేణిగుంట మండలంలో పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్న ఇళ్లను ఆక్రమణల పేరుతో కక్షపూరితంగా ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేశారు. శ్రీకాళహస్తి సన్నిధివీధిలో ఆక్రమణల పేరుతో ముందస్తు సమాచారం లేకుండా తొలగించారు. రివర్‌వ్యూ హోటల్‌పై కక్షపూరితంగా బఫర్‌జోన్ పేరుతో సొంత స్థలంలో ఉన్నప్పటికీ తొలగించి, అవినీతి కార్యక్రమాలు అని చెప్పి ఇంత వరకు దానివైపు కన్నెత్తి చూడలేదు.

ఉద్యోగులు తొలగింపు..దాడులు

ఉపాధిహామీ, ఆశా, సంఘమిత్రలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రీన్ అంబాసీడర్లు, ఆలయంలో సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది తదితర చిరుద్యోగులు సుమారు వెయ్యిమందికి పైగా తొలగించారు. కొంతమంది సంఘమిత్రలు, వెలుగు కోఆర్డినేటర్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఘటనలు చోటు చేసుకున్నాయి. వాగివేడు వలంటీర్ ఇంటిపై దాడి చేసి, వస్తువులను ధ్వంసం చేశారు.

గ్రామ బహిష్కరణ

తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ, ఏర్పేడు మండలం ఈశ్వరయ్య కాలనీలో సుమారు 30 కుటుంబాలు టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెడ్ బుక్ పాలనతో దాడులకు భయపడి ఊర్లు విడిచి పారిపోయి, దుర్భర జీవితం గడుపుతున్నారు. కొత్తకండ్రిగ గ్రామస్తులపై పలుసార్లు దాడులు జరిగాయి. ఇళ్లపై, ఇళ్లలో ఉండే వస్తువులను దోచుకెళ్లే చేసే పరిస్థితి ఏర్పడింది.



ఇల్లు కొట్టేశారని చెబుతున్న మహిళ



దాడిలో గాయపడిన కొత్తకండ్రిగవాసి

ఇసుక, మట్టి మాఫియా

ఉచిత ఇసుక పేరుతో టీడీపీ నాయకులు అక్రమాలకు తెరదీశారు. నిబంధనలను ఉల్లంఘించి యథేచ్ఛగా ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించి, అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. పాలకుల అండదండలతో ఇసుక డంప్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. తొట్టంబేడు మండలం స్వర్ణముఖి తీర ప్రాంతం, శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లు, రేణిగుంట స్వర్ణముఖి తీర ప్రాంతంలో ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇందులో భాగంగానే ముచ్చివోలు రోడ్డులో బండిపై వెళుతున్న తండ్రీకొడుకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. తొట్టంబేడు మండలంలో తెలుగుగంగ కాలువ చుట్టూ ఉన్న గ్రావెల్‌ను రామచంద్రాపురం, రేణిగుంట, ఇలగనూరు, ఏర్పేడులో గ్రావెల్, చెరువు మట్టిని యథేచ్ఛగా రియల్టర్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

ఆలయంలో దోపిడీ

శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతు మండపాలు, మొబైల్ కౌంటర్లలో విచ్చలవిడిగా దోచుకుంటున్నారు. అందరికీ వాటాలు వెళ్లడంతో ఎవరూ నోరు మెదపడంలేదు. అన్ని కాంట్రాక్టులను టీడీపీ నేతలకు కట్టబెడుతున్నారు. ఆలయంలో విధులు కేటాయింపులో ముడుపులు చేతులు మారుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వేదపండితులు సైతం ముడుపులు చెల్లించి రాహుకేతు మండపాల్లో విధులు వేయించుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

దాడులు

శ్రీకాళహస్తి మండలం పోలి భీమవరం గ్రామానికి చెందిన మహిళపై రూరల్ ఎస్‌ఐ దాడి చేశాడు. అలాగే జనసేన, టీడీపీ మధ్య జరుగుతున్న వర్గపోరును చిత్రీకరిస్తుండగా విలేకరులపై దాడులు, ఎమ్మెల్యే డ్రైవర్‌ను అన్నాడని పోలీసుపై దాడికి యత్నించడం, ఆలయానికి సంబంధించిన స్థలం సంరక్షించేందుకు వెళ్లిన ఉద్యోగులపై ఆక్రమణదారులు దాడులకు తెగబడ్డారు.



దాడులకు భయపడి వైష్ణవి కోనేరులో తలదాచుకున్న కొత్తకండ్రిగ వాసులు

మద్యం మాఫియా

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మద్యం ఏరులై పారిస్తున్నారు. సిండికేట్‌గా మారి అన్ని దుకాణాలను అధికార పార్టీ నాయకులే దక్కించుకుని, విచ్చలవిడిగా బెల్టుషాపులు, పర్మిట్లు రూమ్‌లను ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు. సలార్ సినిమా తరహాలో మద్యం బాటిళ్లపై సీల్ వేసి మరీ సిండికేట్ దందా సాగిస్తోంది.



24 గంటల పాటు తెరిచి ఉంచిన మద్యం దుకాణం

సామూహిక అక్షరాభ్యాసం



రేణిగుంటలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణవేణి

ఏర్పేడు: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రేణిగుంట సీడీపీఓ కృష్ణవేణి హాజరై, చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. పూర్వ పాఠశాల విద్యను అందించే అంగన్‌వాడీ కేంద్రాలలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిల్లలకు తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 దయాకర్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట బుగ్గవీధి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ కృష్ణవేణి పాల్గొని, 3 ఏళ్లు నిండిన పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసం చేయించి, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమవతి, అంగన్‌వాడీ టీచర్ ధనమ్మ, అంబిక, రేవతి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పేడులో సామూహిక అక్షరాభ్యాసం

అంకమ్మ కొలుపు వివాదం పరిష్కారం

సత్యవేడు: మండలంలోని కన్నావరంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న అంకమ్మ కొలుపులో నెలకొన్న వివాదాన్ని డీఎస్పీ రవికుమార్, శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు పరిష్కరించారు. గ్రామస్తులకు దళితవాడ ప్రజల మధ్య రాజీ కుదిర్చి కాలనీవాసులకు అమ్మవారి దర్శనం కల్పించడంతో వివాదం ముగిసింది. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఎస్‌ఐ హరిప్రసాద్, ఏఎస్‌ఐ జయరాం నాయక్, పీసీలు పురుషోత్తం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కనుసన్నల్లో టీడీపీ, జనసేన

తిరుపతి కల్చరల్: కేంద్రంలో, రాష్ట్రంలో ప్రజా వంచన పాలన కొనసాగుతోందని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈద సుధాకర్‌రెడ్డి విమర్శించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు గొడపేరు చిట్టిబాబు 25 మందితో కూడిన కాంగ్రెస్ నగర నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు బీజేపీ కనుసన్నల్లో పని చేస్తున్నాయని మండిపడ్డారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పార్టీ నేతలు, కార్యకర్తలతో శుక్రవారం శ్రీకాళహస్తిలో ముఖాముఖి నిర్వహించనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

హామీలకు కూటమి పంగనామం

తిరుపతి అర్బన్: అధికారం కోసం ఆర్భాటం తప్ప.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథరెడ్డి మండిపడ్డారు. గురువారం తిరుపతి కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ సీపీఎం నేతలతో కలసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలకు ప్రభుత్వం పంగనామాలు పెట్టిందని మండిపడ్డారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటుపరం కాకుండా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారు కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ఏఐటీయూసీ, సీపీఐ నేతలు పాల్గొన్నారు.

వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌తో రైతులకు మేలు



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు

ఏర్పేడు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంతో రైతులకు మేలు జరుగుతుందని, అధునాతన వ్యవసాయ పద్ధతులు వారికి చేరువ చేయవచ్చని రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యం, కరకంబాడి పంచాయతీల్లో గురువారం వికసిత్ కృషి అభియాన్ కార్యక్రమంపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. రానున్న ఖరీఫ్‌లో సాగు చేసే పంటల్లో అధిక దిగుబడి నిచ్చే రకాలు, ప్రధాన పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్ష ప్రాముఖ్యత, భూసార పరీక్ష పత్ర వినియోగం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన కోళ్లు, గొర్రెల పెంపకం, పశుపోషణ, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ సీనియర్ శాస్త్రవేత్త మంజునాథ్, డీఆర్సీ వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, పశు వైద్య శాస్త్రవేత్త డి.అనూష, సర్పంచ్ గంగారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోగిలకు ఘనంగా సన్మానం



కోగిల సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు కోగిల సుబ్రహ్మణ్యంను గురువారం శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు ఘన సన్మానించారు. ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు న్యాయం జరిగేలా పోరాటం చేయడమే మన ప్రథమ కర్తవ్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ తొట్టంబేడు మండలం అధ్యక్షుడు కోగిల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆశీస్సులతో పార్టీ తొట్టంబేడు మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడం తన అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం నియోజవర్గ అధ్యక్షుడు శ్రీవారి సురేష్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు పఠాన్ ఫరీద్, డాక్టర్స్ సెల్ మండల అధ్యక్షుడు శివశంకర్, దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాధన మున్నా రాయల్, మాజీ కౌన్సిలర్ ఉత్తరాది శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, పులి రామచంద్రయ్య, పూడి రవి, షేక్ జూమ్లేష, వల్లం గోపి, కొల్లూరు హరినాథ్ నాయుడు,పెరుమాళ చౌదరి , బాబు, సోము, ఆశ కిరణ్,రమణారెడ్డి, మునికుమార్,సుధీర్, ప్రసాద్ పాల్గొన్నారు.

గంగమ్మా.. కాపాడవమ్మా!

- మరగాళ్లు.. వేపచీరలు..
- భక్తి పరవశం.. అన్నదానాలు
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



సత్యవేడులో గంగమ్మను దర్శించుకుంటున్న నూకతోటి రాజేష్

సత్యవేడు: గంగ జాతరలో భాగంగా గంగమ్మకు మరగాళ్ల నృత్యం, పొర్లు దండాలు, వేప చీరలతో మొక్కులు చెల్లిస్తూ భక్తులు సందడి చేశారు. సత్యవేడులో బుధవారం రాత్రి ప్రారంభమైన గంగమ్మ ఊరేగింపు గురువారం ఉదయం ఏడు గంటల వరకు సాగింది. పర్ణశాలలో గంగమ్మను ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామ పరిధిలో అష్టబంధనం కట్టిన వీధుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు మరగాళ్ల(కరగాటం) నృత్య ప్రదర్శనలు చేశారు.

వేపచీర మొక్కులు

కోరిన కోర్కెలు తీరిన వారు, అనారోగ్యం నుంచి కోలుకున్న వారు వేపచీర(వేపాకు శరీరానికి చుట్టుకొని) మొక్కులు, పొర్లు దండాలు పెడుతూ అమ్మవారిని పలువురు భక్తులు మొక్కులు చెల్లిస్తారు. భక్తులకు స్నానాలకు అవసరమైన నీటి వసతిని సర్పంచ్ పి.మంజుల, పంచాయతీ అధికారులు కల్పించారు.

మట్టి విగ్రహానికే అలంకరణ

గంగమ్మ రూపాన్ని బంకమట్టితో సత్యవేడు పట్టణానికి చెందిన లోకప్రభు.. ప్రత్యేకంగా గ్రామ రజకుని ఇంట తయారు చేసి అలంకరణ చేస్తారు. తప్పెట్లు, వాయిద్యాల హోరు, బాణసంచా మోత సడుమ రజకులు వంతుల వారీగా అమ్మవారిని మోస్తూ వీధుల్లో ఊరేగించారు.

పలు ప్రాంతాల్లో అన్నదానం

నేతాజీ రోడ్డులో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మురళి(చికెన్ చిన్నా) ఆధ్వర్యంలో, గాంధీరోడ్డులో బేరిశెట్టి సంఘం నాయకులు, దేవాంగపురం వీధిలో దేవాంగ సంఘం, బలిజ సంఘం నాయకులు, ఆటో కార్మిక సంఘం నాయకులు అన్నదానాలు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భోజనం ఇబ్బందులు కలుగకుండా అన్నదానాలు చేపట్టారు.

అమ్మవారి సేవలో నూకతోటి

నడివీధి పర్ణశాలలో కొలువు దీరిన గంగమ్మను వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ దర్శించుకున్నారు. వీరితోపాటు తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ, భానుప్రకాష్‌రెడ్డి, మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ నిరంజన్ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రమేష్, సురుటుపల్లి మాజీ చైర్మన్ ఏఎంసీ బాలాజీ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. పటిష్ట బందోబస్తుతో భక్తులకు ఇబ్బందులు లేకుండా సీఐ మురళీనాయుడు దర్శన ఏర్పాట్లు చేశారు.







మొక్కులు చెల్లించేందుకు గంగమ్మ గుడి వద్దకు వెళుతున్న భక్తులు, ఆలయం వద్ద వేపచీర మొక్కులు చెల్లిస్తున్న యువకులు, చిన్నారులు, అన్నదానం చేస్తున్న భక్తులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కళాశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

వరదయ్యపాళెం: పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అన్ని రకాలుగా మంచి జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. గురువారం కళాశాల ప్రాంగణంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు తమ గ్రామాల్లో, ఇళ్ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ బాబాఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.